క్లుప్తంగా

సీఆర్ఆర్ సొసైటీకి రూ.కోటి విరాళం



ఇంద్రకుమార్‌కు విరాళం చెక్కు అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి విద్యా సంస్థల సొసైటీకి దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, సీఆర్ఆర్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం రూ.కోటి విరాళం అందించారు. ఈ మేరకు చెక్కును మంగళవారం విద్యా సంస్థల పాలక మండలి అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్‌కు పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి కోశాధికారి చిట్టూరి జానకి రామయ్య, సంయుక్త కార్యదర్శులు కొడాలి సుబ్బారావు, వల్లభనేని శ్రీకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గంతో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు (టూటౌన్): జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నికైంది. సమాఖ్య సమావేశం స్థానిక వట్లూరు టీటీడీసీలో మంగళవారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా పూసం గంగా భవాని (బుట్టాయిగూడెం), ఉపాధ్యక్షురాలిగా ఆవుల స్వర్ణ కుమారి (మండవల్లి), కార్యదర్శిగా తోట కృపామణి (కొయ్యలగూడెం), సహాయ కార్యదర్శిగా సయ్యద్ సుల్తానా (ఉంగుటూరు), కోశాధికారిగా గోళ్ల శాంతకుమారి (అగిరిపల్లి) ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండల సమాఖ్యల నుంచి ముగ్గురు చొప్పున పాలకవర్గ సభ్యులు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, జిల్లా యాంకర్ పర్సన్లు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



కీర్తనలు ఆలపిస్తున్న గాయనులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్వామి వారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నిమ్మగడ్డ కల్యాణి భక్తి సంగీత విభావరి స్వర నీరాజనం కార్యక్రమంలో భాగంగా భక్తి కీర్తనలను ఆలపించి అలరించారు. అనంతరం కొండేటి ఉమా మహేశ్వరి కూచిపూడి నృత్యం, రాత్రి 7.30 గంటలకు కిళాంబి పూర్ణశ్రీ కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

శాంతి కోసం ప్రార్థనలు

దెందులూరు: ప్రతి ఒక్కరికీ మరింత శాంతి, సౌభ్రాతృత్వం, సేవాభావం దేవుని దీవెనలతో లభించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. మంగళవారం సెయింట్ జాన్స్ విద్యాసంస్థల్లో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక దివ్య పూజాబలి నిర్వహించారు. ప్రజలందరి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సంతోషం, స్వయం ఉపాధిని, సంపూర్ణ ఆరోగ్యం, శాంతి తమ వల్లే ఇరుగు పొరుగు వారిని ప్రేమించే గుణం కలగాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలను, ఆశీర్వాదాలను ఇచ్చారు.

నూతనోత్సాహం



ఆర్ఆర్‌పేటలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. ప్రధాన రహదారుల్లో టెంట్లు ఏర్పాటుచేసి పండ్లు, వివిధ రకాల పండ్లతో గిఫ్ట్ ప్యాక్‌గా, పండ్లతో పాటు వివిధ రకాల డ్రైఫ్రూట్స్‌తో గిఫ్ట్ ప్యాక్‌లను విక్రయించారు. వివిధ రెస్టారెంట్లలో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. సింగిల్ బిర్యానీ రూ.150, ఫ్యామిలీ ప్యాక్ రూ.550తోపాటు కూల్ డ్రింక్ ఉచితమంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో ఊదరగొట్టారు. రాత్రి 7 గంటల నుంచే మహిళలు తమ ముంగిళ్లలో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. మంగళవారం రాత్రి 12 గంటల వరకూ, తిరిగి బుధవారం రాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు తెరుచుకునే విధంగా ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో మద్యపాన ప్రియులు మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో జరిగే ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పలువురు మండిపడుతున్నారు.



కేకులు కొనుగోలులో బిజీగా..



ఆకర్షణీయంగా ఉన్న పూలబొకేలు



ఏలూరు విజయవిహార్ సెంటర్‌లో ట్రాఫిక్



చిన్నారులను ఆకర్షించే గ్రీటింగ్ కార్డ్స్

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



కొత్తపేట నూకాలమ్మ గుడి వద్ద చెత్తా చెదారంతో నిండిన ప్రధాన డ్రెయినేజీ



కొత్తపేటలో తాగునీటి పైప్‌లైన్

- పేరుకుపోతున్న సిల్టు
- వర్షాకాలంలో రోడ్డెక్కుతున్న మురుగు
- పట్టించుకోని పాలకులు
- 43, 45 డివిజన్ ప్రజలకు అవస్థలు



43వ డివిజన్‌లో మురుగులోనే పైప్‌లైన్



గంగానమ్మ గుడి వద్ద వెడల్పు తగ్గిన డ్రెయినేజీ

ఏలూరు రూరల్ : 40 ఏళ్ల క్రితం నాటి డ్రెయినేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడ సిల్టు పేరుకుపోయి మురుగునీరు ముందుకు పారడం లేదు. డ్రెయిన్లను ఆనుకుని ఉన్న పైప్‌లైన్ పాడైనప్పుడు మురుగు నీరు కలిసి తాగునీరు కలుషితమవుతుంది. పలుచోట్ల పైపుల వద్ద చెత్తా చెదారం నిలిచిపోయి మురుగు నీటి పారుదలకు ఆటంకంగా మారింది. దీంతో 43, 45 డివిజన్ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రెయిన్లను మరింత వెడల్పు చేసి, సిల్ట్ తొలిగించి మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపించాలని వారు కోరుతున్నారు. ఏలూరు కొత్తపేట, ఏకేజీ సెంటర్, నీలట్యాంక్, గంగానమ్మ గుడి, చొదిదిబ్బ, కుస్తీలదొడ్డి తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్య ప్రజలను వేధిస్తోంది. ఇళ్లలోని వాడకం నీరు డ్రెయినేజీల నుంచి కిందికి పారడం లేదు. వర్షాకాలంలో డ్రెయిన్లలో మురుగునీరు పొంగి పొర్లి రోడ్లపైనే ప్రవహిస్తుంది.

డ్రెయినేజీపై నిర్మాణాలు

డ్రెయినేజీ వెడల్పు పలు ప్రాంతాల్లో తగ్గిపోతుంది. ఇళ్లల్లోని వాడకం నీరు వేగంగా బయటకు పోవడం లేదు. కొందరు డ్రెయిన్లపై నిర్మాణాలు చేపట్టారు. దీంతో డ్రెయినేజీ వంపులు తిరిగి, మురుగునీరు పారేందుకు ఆటంకంగా మారింది. అధికారులు స్పందించి డ్రెయిన్‌ను అభివృద్ధి చేయాలి.

– కె.శ్రీనివాసరావు, 34వ డివిజన్

తాగునీరు కలుషితం

పలు వీధుల్లో డ్రెయినేజీని ఆనుకుని తాగునీటి పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్ తుప్పు పడుతుంది. ఇప్పటికే చాలా సార్లు తాగునీరు కలుషితమైంది. ఐనా పైప్‌లైన్ మార్చడం లేదు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మార్చాలి.

– ఎస్ జోగేశ్వరరావు, 33వ డివిజన్

పేరుకుపోతున్న సిల్టు

పవర్‌పేట, కొత్తపేట, నీల ట్యాంక్ మీదుగా వెళుతున్న ప్రధాన డ్రెయినేజీలో సిల్టు పేరుకుపోతుంది. ప్రధాన డ్రెయిన్‌పై కట్టిన కల్వర్టు, వంతెనల వద్ద సమస్య ఏర్పడుతుంది. డ్రెయిన్‌లో మురుగు వేగంగా కిందికి పారడం లేదు. వంతెనల వద్ద సిల్టు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– బి.నాగేశ్వరరావు, 34వ డివిజన్

వర్షాకాలంలో సమస్య ఎక్కువ

వర్షాకాలంలోనే డ్రెయినేజీ సమస్య ఎక్కువగా ఉంటుంది. కురిసిన వర్షం నీరు వేగంగా కిందకు పారడం లేదు. మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. మళ్లీ డ్రెయినేజీ నుంచి కిందికి పారేంత వరకూ ఇళ్ల ముందు నిలిచి ఉంటుంది. ఇంటి ముందు బురద కడుక్కోవల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

– వి.సురేష్, కొత్తపేట

అగ్నిప్రమాద బాధితులకు జేపీ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న జేపీ



నిత్యావసరాలను అందజేస్తున్న పెరికె

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని 47వ డివిజన్‌లో ఆకస్మికంగా గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వటంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధితులను వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మంగళవారం పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు దాసరి రమేష్, మున్నుల జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు, మద్దాల ఫణి, దాలి వెంకటేష్, నాయకులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్థానిక ఇజ్రాయిల్ పేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండిళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బాధిత కుటుంబాలను సెంట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఏలూరు సోషల్ సర్వీస్ డైరెక్టర్ ఫాదర్ ఇమాన్యుల్ ఆదేశాల మేరకు 25 కేజీలు బియ్యం, టెట్రా మిల్క్, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్ పేట పెద్దలు జుంజు మోజెస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, కలపాల రవి, రిటైర్డ్ ఆఫీసర్ పాలరాజు, కడిమి యోహాను, కట్టెంపూడి రంగారావు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా మంగళవారం ఏలూరు వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగ సమస్యలు పరిష్కారానికి రైతు సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో రైతులకు పెట్టుబడి సాయం అందించి అన్ని విధాలా తోడ్పాటు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయ శాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, నాయకులు ఎం.శ్రీనివాసరావు, జక్కుల రామారావు, రైతులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తూర్పుకాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక శేఖర్‌వీధిలోని తూర్పుకాపు సంఘ భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. తూర్పుకాపులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలని నాయకులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భోరోతు బాలాజీ, సానుపల్లి యుగంధర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

దెందులూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అమానుష వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, కొంగర రత్నకుమార్, బల్ల విజయకుమార్, పండు, కులవర్తి సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ హోంమంత్రి తన తప్పు తెలుసుకుని బీఆర్ అంబేడ్కర్‌పై తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని తప్పు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

పంట రుణాలు అందించాలి

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జమలయ్య

ఏలూరు (టూటౌన్): కౌలు రైతులందరికీ రబీ సీజన్‌లో తనఖా రహిత పంట రుణాలు అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్‌లో భాగంగా కౌలు రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం నందు మంగళవారం నిర్వహించిన కౌలు రైతుల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారని, వీరిలో సగం మందికే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేశామని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. కార్డులు పొందిన వారిలో పంట రుణాలు ఒక శాతం కూడా ఇవ్వలేదని, కౌలురైతులకు పంట రుణాలు అందించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ ఆరు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా వంద మంది పైగా కౌలురైతులు, రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆత్మహత్యలు నివారించాలంటే వడ్డీ లేని పంట రుణాలు అందించి తీరాలన్నారు. బలవన్మరణానికి పాల్పడిన ప్రతి బాధిత రైతు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, సమాజంలో నిరక్షరాస్యతను పారదోలి, సమాజంలో వెలుగులు నింపే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ వాల్ క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్లను, ఏపీటీఎఫ్ 1938 డైరీని మంగళవారం ఆమె తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలను పేద పిల్లలకు చేర్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాసగిరి శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ 1938 సంఘ రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జి.కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నం బాబు, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో మెప్మా ఆధ్వర్యంలో హోమ్ లై యాంగిల్స్ సంస్థ ద్వారా వివిధ రంగాల్లో అనుభవం కలిగిన వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తామని మున్సిపాల్ కమిషనర్ కె.వెంకటరమణ మంగళవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లంబర్లు, పెయింటర్స్, కార్పెంటర్స్, ఎలక్ట్రీషియన్, ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీ, గీజర్, మెకానిక్స్, బ్యూటీషియన్ (పురుషులు, స్త్రీలు) రంగంలో ఉన్న సర్వీసు ప్రొవైడర్స్‌ను గుర్తించి పొదుపు సంఘాల సహకారంతో వారి వివరాలు సేకరిస్తామన్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి సంబంధిత రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తామన్నారు. సర్వీసు ప్రొవైడర్ల వివరములు, ఫోన్ నంబర్, చిరునామాలు యాప్‌లో పొందుపరుస్తారన్నారు. వీరికి గుర్తింపు కార్డు జారీ చేస్తామన్నారు. ఈ సర్వీస్ ప్రొవైడర్లను జనవరి 5లోపు మెప్మా కార్యాలయంలో నమోదు చేస్తామని తెలిపారు. వివరాలకు 8309813473, 9398168667 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	04
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	34